## క్లుప్తంగా

### నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

**నెల్లూరు(బారకాసు):** నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని కమిషనర్ నందన్ హెచ్చరించారు. స్థానిక 45వ డివిజన్ వెంకటరామాపురంలో నిబంధనలు పాటించని రెండు భవనాలను కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ విభాగం సమక్షంలో యజమానులు సోమవారం స్వయంగా తొలగించారు. కొంత గడువు కోరి స్వయంగా అనధికార నిర్మాణాలను తొలగించుకుంటామని కోరినందున టౌన్ ప్లానింగ్ విభాగం సమక్షంలో అదనపు అంతస్తుల నిర్మాణాలు తొలగించే ప్రక్రియను చేపట్టామని కమిషనర్ తెలిపారు.

### ఎస్పీ కార్యాలయంలో బదిలీల ప్రక్రియ

**నెల్లూరు సిటీ:** జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సచివాలయ గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఖాళీలను ప్రొజెక్టర్‌పై ప్రదర్శింపజేసి ర్యాంక్ ప్రకారం నిబంధనలు అనుసరించి బదిలీ ప్రక్రియ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సీహెచ్ సౌజన్య, ఏఓ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

### తల్లిదండ్రుల చెంతకు చిన్నారి

**నెల్లూరు సిటీ:** తప్పిపోయిన కుమార్తెను పోలీసులు గంటల వ్యవధిలో తల్లిదండ్రుల చెంతకు చేర్చిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. రూరల్ మండలంలోని నాలుగో మైలుకు చెందిన జలీల్ తన భార్యతో కలిసి ఆదివారం నగరంలోని భగత్‌సింగ్ కాలనీ టిడ్కో సముదాయంలో తెలిసిన వారి ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో రాత్రి ఆలస్యమవడంతో అక్కడే నిద్రించారు. ఈ క్రమంలో మూడేళ్ల పాప భవ్య సోమవారం ఉదయం కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వేణుగోపాల్‌రెడ్డి వెంటనే స్పందించి తన సిబ్బందితో గాలించారు. గంటల వ్యవధిలో పాపను తల్లిదండ్రుల వద్దకు చేర్చారు.

### కుళాయి కనెక్షన్ల తొలగింపు

**నెల్లూరు(బారకాసు):** కార్పొరేషన్‌కు ఏళ్ల తరబడి పన్నులు చెల్లించని కారణంగా రెండు భవనాలకు సోమవారం ఎన్‌ఎంసీ రెవెన్యూ సిబ్బంది కుళాయి కనెక్షన్లు తొలగించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 41వ డివిజన్, శివగిరికాలనీలో ఓ భవన యజమాని 20 ఏళ్ల నుంచి, రాజీవ్ గృహకల్ప పక్కనే ఉన్న మరో భవన యజమాని 15 ఏళ్ల నుంచి ఇంటి పన్ను, కుళాయి పన్ను చెల్లించలేదని సిబ్బంది గుర్తించారు. దీనిపై ఎన్‌ఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారి ఆదేశాల మేరకు రెండు భవనాలకు ముందస్తు చర్యలో భాగంగా కుళాయి కనెక్షన్లు తొలగించారు. ఆర్ఐ కిరణ్, సెక్రటరీ అనుష, అడ్మిన్ సౌజన్య పాల్గొన్నారు.


### వేడుకగా చప్పర ఉత్సవం

**నెల్లూరు(బృందావనం):** మూలాపేటలోని శ్రీకృష్ణధర్మరాజస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు సోమవారం ఉదయం చప్పర ఉత్సవం, రాత్రి హిడింబాసురవధ ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. అర్చకుడు చక్రపాణి ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. ఉభయకర్తలుగా ఉద్దండి కమలమ్మ, వీరయ్య, విజయమ్మ కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఈఓ జానకి పర్యవేక్షించారు.

### 9న సార్వత్రిక సమ్మె

**నెల్లూరు(బారకాసు):** ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జూలై 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొంటున్నారని డిప్యూటీ కమిషనర్ చెన్నుడుకు యూనియన్ నాయకులు తెలియజేశారు. ఈమేరకు స్థానిక ఎన్‌ఎంసీలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం యూనియన్ జిల్లా కార్యదర్శి కె.పెంచల నరసయ్య మాట్లాడుతూ కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం మార్పు చేసి, నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడాన్ని నిరసిస్తూ జూలై 9న దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో మున్సిపల్ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, సీఐటీయూ రూరల్ అధ్యక్షులు కొండా ప్రసాద్, ఎస్.మాలకొండయ్య పాల్గొన్నారు.

### వస్త్రదానం



**నెల్లూరు(బృందావనం):** నవాబుపేట కేపీసీ ఎస్టేట్‌లో పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు అన్నదానం, వస్త్రదానం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు గాదంశెట్టి గోపాల్ మాట్లాడుతూ విద్యాదాత అయిన తన సోదరి గాదంశెట్టి హైమావతి వర్ధంతిని పురస్కరించుకుని కామిశెట్టి ఆదిశేషయ్యశెట్టి, హైమావతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు.

### పౌష్టికాహారం పంపిణీ



**నెల్లూరు(బృందావనం):** కొండాయపాళెం రోడ్డు వనంతోపు సెంటర్‌లో అబైడింగ్ హోప్ ట్రస్ట్ కార్యాలయంలో 50 మంది కేన్సర్ బాధితులకు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ టైటస్ నిర్మల్‌కుమార్ పౌష్టికాహార కిట్‌లను సోమవారం పంపిణీ చేశారు. నిర్వాహకులు ఎ.జయప్రకాష్, క్రాంతి, సిస్టర్ రమ, జయ, వాణి, సుధాకర్ పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి వినతి

**ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజలు పోటెత్తారు. తమ సమస్యలను సకాలంలో పరిష్కరించాలని కోరారు. నగరంలోని కలెక్టరేట్‌తో పాటు కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజలు, వివిధ సంఘాల నాయకులు వినతి పత్రాలను అందజేశారు. ఆయా అర్జీలను పరిశీలించిన అధికారులు నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.**



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ నందన్

**నెల్లూరు(బారకాసు):** నగరపాలక సంస్థ పరిధిలోని టిడ్కో గృహాల నిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేసి, విజయదశమి నాటికి బీ, సీ కేటగిరీల డబుల్ బెడ్ రూమ్ గృహాలను లబ్ధిదారులకు అందించనున్నామని కమిషనర్ నందన్ తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎన్‌ఎంసీ కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ నందన్ పాల్గొని వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయనున్నామని తెలిపారు. ఏ కేటగిరి విభాగంలో గృహాలు మంజూరైనప్పటికీ ఇప్పటివరకు స్వాధీనం చేసుకొని లబ్ధిదారులకు నోటీసులు అందజేస్తున్నామని, స్పందించని లబ్ధిదారుల గృహాలను ఇతరులకు క్రమపద్ధతిలో కేటాయిస్తామని స్పష్టం చేశారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఇప్పటివరకు 36 భవనాలకు సంబంధించి జిల్లా కోర్టులో పిటిషన్లు దాఖలు చేశామని, క్రిమినల్ చర్యల కోసం సమన్లు కూడా సంబంధిత యజమానులకు జారీ అయ్యాయని వెల్లడించారు. రామ్మూర్తినగర్ ప్రాంతంలో అనుమతుల్లేని రెండు నిర్మాణాలను కూల్చివేస్తున్నామని తెలిపారు.

**మొత్తం 47 అర్జీలు**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మొత్తం 47 అర్జీలు స్వీకరించామని కమిషనర్ వెల్లడించారు. అందులో విభాగాల వారీగా అకౌంట్ సెక్షన్ 1, అప్కాస్ 2, ఇంజినీరింగ్ 7, టిడ్కో హౌసింగ్ 20, రెవెన్యూ 3, టౌన్ ప్లానింగ్ 9, పబ్లిక్ హెల్త్ 5 చొప్పున అందుకున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, సిటీప్లానర్ హిమబిందు, సెక్రటరీ శ్రీలక్ష్మి, మేనేజర్ రాజేశ్వరి, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**జీవనోపాధి కోల్పోతారు**

**నెల్లూరురూరల్:** రోడ్డెక్కిన కరేడు రైతుల ఆందోళనను గౌరవించాలని, వారి భూములు తీసుకుంటే జీవన ఉపాధిని శాశ్వతంగా కోల్పోతారని బీజేపీ నేత మిడతల రమేష్ కలెక్టర్ ఆనంద్ దృష్టికి తీసుకొచ్చారు. భూసేకరణ జరిపే కరేడులో బీసీ కులాల రైతులే పంటలను సాగు చేస్తున్నారన్నారు. చిన్న, సన్నకారు రైతుల జీవనాధారమైన భూములను ప్రభుత్వం తీసుకుంటే వారి జీవితం దుర్భరంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో రఘురామయ్య, నరాల సుబ్బారెడ్డి, వెంకటేష్, పద్మావతి, నారాయణ, సూర్యనారాయణ, ఏవీ సుబ్బయ్య, లక్ష్మణరావు, ప్రభాకర్ ఉన్నారు.

**ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభించాలి**

**నెల్లూరు(అర్బన్):** రూరల్ మండల పరిధిలోని మొగళ్లపాళెంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియాన్ని తక్షణమే ప్రారంభించాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ ఆనంద్‌కు అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎమ్వీ రమణ మాట్లాడుతూ 15 ఏళ్ల క్రితం మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంతో పాటు క్రికెట్ గ్రౌండ్, రన్నింగ్ ట్రాక్ నిర్మించే ఉద్దేశంతో మొగళ్లపాళెం గ్రామస్తుల నుంచి 157 ఎకరాల భూమిని సేకరించారన్నారు. అయితే కేవలం రెండెకరాల్లో ఆరేళ్ల క్రితం మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియాన్ని నిర్మించి అలా వదిలేశారన్నారు. ప్రారంభించకముందే అది శిథిలావస్థకు చేరుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. అందువల్ల తక్షణమే దీనిని ప్రారంభించాలన్నారు. అలాగే మిగతా భూమిలో రన్నింగ్ ట్రాక్‌తో పాటు క్రికెట్ గ్రౌండ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ, నాయకులు జగదీష్, శేఖర్, యశ్వంత్, రాజేష్‌లు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

## లీజు చెల్లింపులకు గడువు ఇవ్వాలి

**నెల్లూరురూరల్:** కనిగిరి మండలం దువ్వూరు, గాంధీ జనసంఘం, మత్స్యకార సహకార సంఘం, మత్స్యకార సభ్యుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీకి సంబంధించి లీజు మొత్తం తగ్గించాలని, లీజు చెల్లింపులకు గడువు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరగా, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష, జిల్లా కమిటీ సభ్యుడు యల్లంపల్లి శీనయ్య, డైరెక్టర్లు చలంచర్ల నరసయ్య, తిరుమలశెట్టి వెంకటరమణయ్య, మారెళ్ల బంగారయ్య పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న యానాదుల సంక్షేమ సంఘం నాయకులు



# న్యాయం చేయండి సారూ..



బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న పోలీస్ అధికారులు

**నెల్లూరు సిటీ:** మా వినతుల్ని పరిశీలించి న్యాయం చేయండి సారూ అంటూ ప్రజలు కోరారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాలతో అధికారులు 74 ఫిర్యాదులు స్వీకరించారు. తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు బాధితులకు భరోసా ఇచ్చారు. సమావేశంలో నగర డీఎస్పీ సింధుప్రియ, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ సుబ్బారావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌బీ 2 సీఐ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఫిర్యాదుల్లో కొన్ని..**

- మ్యాట్రిమోనీ ద్వారా వెస్ట్ గోదావరికి చెందిన మల్లుల రాజకుమార్‌తో పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి రూ.3 లక్షలు తీసుకున్నాడు. వివాహం చేసుకోకుండా దూరం పెడుతున్నాడు. నగదు ఇవ్వడం లేదని కొండాపురానికి చెందిన దివ్యాంగురాలు ఫిర్యాదు చేశారు.
- బిట్రగుంట పరిధిలోని ఓ డిగ్రీ కళాశాలలో చదువుతున్నాను. తెల్లగుంటకు చెందిన బూదురు భరత్‌కుమార్ ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. తననే పెళ్లి చేసుకోవాలని లేకపోతే చంపేస్తానని బెదిరిస్తున్నాడని దగదర్తికి చెందిన డిగ్రీ విద్యార్థిని వినతిపత్రం ఇచ్చారు.
- రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పనిచేస్తున్నానని, ఇంటి రిజిస్ట్రేషన్ చేయిస్తానని నమ్మించి ఒకరు రూ.2.10 లక్షలు తీసుకున్నాడు. రిజిస్ట్రేషన్ చేయించలేదు. డబ్బు తిరిగి ఇవ్వమంటే స్పందించడం లేదని చిన్నబజారుకు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు.
- నా కుమారుడు రూ.3 కోట్ల విలువ చేసే ఆస్తి తీసుకున్నాడు. ప్రస్తుతం నా ఆరోగ్యం బాగోలేదు. కనీసం అన్నం కూడా పెట్టడం లేదని మనుబోలుకు చెందిన ఓ వృద్ధుడు వినతిపత్రమిచ్చాడు.
- నేను టీబీ వ్యాధితో బాధపడుతున్నాను. నా పేరు మీద ఉన్న రెండు ఎకరాల పొలం, ప్లాట్లు రాసివ్వాలని పెద్ద కుమారుడు, కోడలు ఇబ్బంది పెడుతున్నారని కావలికి చెందిన ఓ వృద్ధురాలు ఫిర్యాదు చేశారు.
- నా కుమార్తె నెలరోజుల నుంచి కనిపించడం లేదు. దానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి. కుమార్తె ఆచూకీ కనుక్కొని అప్పగించాలని నెల్లూరు రూరల్‌కు చెందిన ఓ మహిళ కోరారు.
- నేను 2017లో ప్రేమ వివాహం చేసుకున్నాను. ఇద్దరు పిల్లలున్నారు. కొంత కాలంగా నా భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. మమ్మల్ని పట్టించుకోవడం లేదు. భర్త, అత్తమామలు శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. నన్ను, పిల్లల్ని ఇంటి నుంచి గెంటేశారు. కౌన్సెలింగ్‌నిర్వహించి కుటుంబాన్ని చక్కదిద్దాలని వెంకటాచలం ప్రాంతానికి చెందిన ఓ మహిళ వినతి పత్రం ఇచ్చారు.

## 7న ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన

**నెల్లూరు (టౌన్):** స్థానిక మూలాపేటలోని బాలికోన్నత పాఠశాల ఆధునికీకరణ పనులకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. స్థానిక మూలాపేటలోని బాలికోన్నత పాఠశాలలో ఆధునికీకరణ పనులను ఆయన సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈ పాఠశాలలో 1,050 మంది చదువుకునేలా ఆధునికీకరించనున్నట్లు చెప్పారు. డీసీఆర్ కంపెనీ అధినేత సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి నారాయణ పిలుపు మేరకు బాలికోన్నత పాఠశాలలో ఆధునికీకరణ పనులు చేపట్టామన్నారు.

## వైద్యులకు కళా వందనం



మామిడి పండుపై వైద్యురాలి చిత్రం

**నెల్లూరు(బృందావనం):** డాక్టర్స్ డేను పురస్కరించుకుని హరనాథపురానికి చెందిన కళాకారుడు సోమా పద్మారత్నం మామిడి పండుపై వైద్యురాలి చిత్రాన్ని తీర్చిదిద్దారు. ఈ మేరకు వారికి డాక్టర్స్‌డే శుభాకాంక్షలు తెలిపారు.

## చర్యలు తీసుకోవాలి

**నెల్లూరురూరల్:** డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి పదవీ విరమణ చేసిన కొప్పోలు చిరంజీవిపై చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ సభ్యుడు ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఆయన అసోసియేషన్‌కు చెందిన దుకాణాలకు అడ్వాన్సులు, అద్దెలు దండుకున్నారని ఆరోపించారు. అతనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## లారీ డ్రైవర్ మృతి

**నెల్లూరు సిటీ:** ఓ లారీ డ్రైవర్ తన క్యాబిన్‌లో నిద్రిస్తున్న సమయంలో గుండెపోటుతో మృతిచెందిన ఘటన సోమవారం వెలుగుచూసింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. తమిళనాడులోని సేలం ప్రాంతానికి చెందిన రాజశేఖరన్(46) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. దూర ప్రాంతాలకు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుంటాడు. ఈ క్రమంలో చెన్నై నుంచి విజయవాడకు వెళ్లి తిరుగు ప్రయాణంలో నెల్లూరు రూరల్ అల్లీపురం వెంకట విఘ్నేశ్వర రైస్‌మిల్లులోని ధాన్యం లోడ్‌చేసేందుకు ఆదివారం సాయంత్రం చేరుకున్నాడు. లోడింగ్ చేసుకునేందుకు ఆదివారం రాత్రి అక్కడే లారీని పార్కింగ్ చేసుకుని క్యాబిన్‌లో నిద్రించాడు. ఉదయం కూలీలు నిద్రలేపే ప్రయత్నం చేయగా స్పందించలేదు. పరిశీలించగా గుండెపోటుతో మృతిచెంది ఉంటాడని నిర్ధారించారు. మృతుడు భార్య గోమతి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ

**నెల్లూరురూరల్:** కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 11 మంది దివ్యాంగులకు 11 ల్యాప్‌టాప్‌లను జేసీ కార్తీక్ అందించారు. కలెక్టరేట్ ఏఓ విజయకుమార్ పాల్గొన్నారు.

## కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

**నెల్లూరు సిటీ:** కుల దూషణపై చిన్నబజారు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. నగరంలోని శెట్టిగుంటరోడ్డు అరుంధతీయపాళెంలో ఉంటున్న సుజన ఓ రాజకీయ పార్టీలో నాయకురాలిగా ఉంది. ఈ క్రమంలో గత నెల 18న జిల్లా కోర్టులోని క్యాంటీన్‌లో ఉండగా గాయత్రి అనే మహిళ ఎదురుపడి దుర్భాషలాడుతూ కులం పేరుతో దూషించింది. దీనిపై బాధితురాలు సుజన చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అమీర్ ఆర్ట్స్ అకాడమీకి ఐఎస్ఓ గుర్తింపు

**నెల్లూరు(బృందావనం):** చిత్రకారుడు అమీర్‌జాన్ స్థానిక టెక్కేమిట్టలో నిర్వహిస్తున్న అమీర్‌ఆర్ట్స్ అకాడమీ ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికెట్‌కు అర్హత పొందింది. అందుకు సంబంధించి ఢిల్లీకి చెందిన డెల్టా 300 గ్లోబల్ సర్టిఫికేషన్ సొల్యూషన్స్ (డీజీసీఎస్) ధ్రువీకరణ పత్రాన్ని పోస్టు ద్వారా పంపారు. దీనిని గాంధీబొమ్మ దగ్గర ఉన్న 25 కళా సంఘాల కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి సోమవారం అందజేశారు. కన్వీనర్లు హరిబాబు, భాస్కర్ పాల్గొన్నారు.

## కమిషనర్ తనిఖీ

**నెల్లూరు(బారకాసు):** నగరపాలక సంస్థ కార్యాలయంలోని పలు విభాగాలను కమిషనర్ నందన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హౌసింగ్, రెవెన్యూ, హెచ్ సెక్షన్లలో పలు రికార్డులను పరిశీలించారు. పనితీరు గురించి విచారించారు.

## గణేష్ ఘాట్ వద్ద మూడో రోడ్డుకు శంకుస్థాపన

**నెల్లూరు సిటీ:** రూరల్ నియోజకవర్గ పరిధిలోని గణేష్ ఘాట్ వద్ద రూ.10 లక్షలతో మూడో రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ ఘాట్‌ను మరింత పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కార్పొరేషన్ ఈఈ శేషగిరిరావు, ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జి దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

- **నెల్లూరు సిటీ:** ఈనెల 2వ తేదీ నుంచి 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన తన కార్యాలయంలో క్లస్టర్, కో-క్లస్టర్ ఇన్‌చార్జీలు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూరల్ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనపై ప్రజలకు వివరిస్తామన్నారు.

# శేషజీవితం హాయిగా గడపాలి

**నెల్లూరు (పొగతోట):** జెడ్పీ పరిధిలో వివిధ హోదాల్లో పనిచేసి పరిపాలనాధికారిగా చేసిన కొండలరావు సేవలు అభినందనీయమని, ఆయన శేషజీవితం హాయిగా గడపాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో కొండలరావు పదవీ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. చైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా హాజరై, కొండలరావు దంపతులను సన్మానించారు. జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, జెడ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

- **నెల్లూరు సిటీ:** రూరల్ మండలంలోని పెనుబర్తి హైస్కూల్లో హెచ్‌ఎం శ్రీకంఠం వెంకట రవిప్రసాద్ పదవీ విరమణ సోమవారం జరిగింది. అందులో భాగంగా పాఠశాల ఉపాధ్యాయులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.
- **నెల్లూరు(బారకాసు):** నగరపాలక సంస్థలో వివిధ విభాగాల్లో పదవీ విరమణ పొందిన ఏడుగురు సిబ్బందిని కమిషనర్ నందన్ అభినందించారు. కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో పదవీ విరమణ పొందిన డి.చక్రపాణి (జూనియర్ అసిస్టెంట్), డి. కొండమ్మ (పబ్లిక్ హెల్త్ వర్కర్), పురుషోత్తంరాజు (ఫౌంటైన్ క్లీనర్)లను శాలువాలతో సత్కరించారు.
- **నెల్లూరు(అర్బన్):** నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేస్తోన్న డాక్టర్ సిద్ధానాయక్ సేవలు ఎనలేనివని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరి, డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డిలు పేర్కొన్నారు. ఆయన పదవీ విరమణ సన్మాన సభను దర్గామిట్టలోని సర్వజన ఆస్పత్రిలో సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడిషనల్ డీఎంఈ కేడర్‌లో ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేసి ఆస్పత్రి అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. డాక్టర్లు మస్తాన్‌బాషా, నరేంద్ర, గంగాధర్ పలువురు డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కొండలరావు దంపతులకు సన్మానం



పెనుబర్తి హైస్కూల్లో..



పోట్ల కృష్ణయ్యకు సత్కారం

- **నెల్లూరు(బారకాసు):** నగరపాలక సంస్థలోని పట్టణ ప్రణాళిక విభాగంలో ట్రేసర్ పోట్ల కృష్ణయ్య పదవీ విరమణ సభ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగింది. మేయర్ స్రవంతి, కమిషనర్ నందన్‌తో పాటు పలు విభాగాల అధికారులు పాల్గొని, ఆయన్ను సత్కరించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్ఈ రామ్మోహన్, సిటీ ప్లానర్ హిమబిందు, మేనేజర్ రాజేశ్వరి, సూపరింటెండెంట్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య

**నెల్లూరు (టౌన్):** వీఆర్ హైస్కూల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో డిజిటల్ విద్యను అందించనున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. స్థానిక వీఆర్ హైస్కూల్‌లో ప్రైమరీ తరగతులను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీఆర్సీ భవనాలు, మైదానాన్ని ఈనెల 7న మంత్రి లోకేష్ ప్రారంభిస్తారన్నారు. ఈనెల 2వ తేదీ నుంచి 6 నుంచి 9వ తరగతి వరకు తరగతులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. వీఆర్సీ తరహాలో మరో రెండు స్కూల్స్‌ను సిద్ధం చేసేందుకు డీఎస్సార్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జేసీ కార్తీక్, కమిషనర్ నందన్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

## డెంగీ నివారణకు కృషి

**నెల్లూరు(అర్బన్):** జిల్లాలో డెంగీ వ్యాధి నివారణ కోసం ప్రతి వైద్యసిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వి.సుజాత అన్నారు. జూలై 1 నుంచి నెలాఖరు వరకు ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ డెంగీ నివారణ మాసోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను స్థానిక సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ, ఇతర డాక్టర్లతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న డెంగీ సీజన్‌ను పురస్కరించుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలన్నారు. డెంగీతో పాటు మలేరియా, టైఫాయిడ్ లాంటి వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, సహాయ మలేరియా నివారణాధికారి నాగార్జునరావు, ఎన్ఆర్‌హెచ్‌పీఓ రమేష్ పాల్గొన్నారు.